గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అవంతి ఆహ్వానం



కాచిగూడ: అవంతి ఇంజినీరింగ్ కళాశాల 20వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా రావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్‌రావు కోరారు. రాజ్‌భవన్‌లో బుధవారం ఆయన గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.

వెంకటరమణకు 'కిన్నెర - సినారె' సాహితీ పురస్కారం

చిక్కడపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి.నారాయణరెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబంధ సాహిత్య విశ్లేషకుడు బాలాంత్రపు వెంకటరమణకు కిన్నెర - సినారె సాహితీ పురస్కారాన్ని కేవీ రమణాచారి ప్రదానం చేశారు. తెలుగు జాతికి సినారె గర్వకారణమని ఆయన కొనియాడారు.

హుండీ కానుకల లెక్కింపు

ముషీరాబాద్: ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద గల ప్రసిద్ధిగాంచిన గౌరీ శంకర ఆలయ హుండీ కానుకలను బుధవారం దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ అండాలు పర్యవేక్షణలో లెక్కించారు. భక్తులు హుండీలో వేసిన కానుకలు 13 గ్రాముల బంగారం, ఐదు తులాల వెండి, రూ.30213 నగదు వచ్చాయని ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి తెలిపారు. మూడు నెలలు భక్తులు వేసిన కానుకలని ఆయన పేర్కొన్నారు. ఆలయ ప్రధానార్చకులు సర్వేశ్వర్, భరత్‌శర్మ, కృపాకర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నీటి సరఫరాను మెరుగు పరచాలి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ అన్నారు. ఈ మేరకు బుధవారం జలమండలి నారాయణగూడ జీఎం శ్రీధర్‌ను మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్‌తో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం అభిషేక్ మాట్లాడుతూ డివిజన్‌లోని వై జంక్షన్, కృపాకర్ లేన్, మాలబస్తీ, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, ఎల్లయ్య బస్తీ తదితర ప్రాంతాలలో తాగునీటి సమస్య నెలకొందన్నారు. కొన్ని ప్రాంతాలలో నీటి ఎద్దడిపై జీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని చెప్పారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



బస్తీ దవాఖానాలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ సూచించారు. బుధవారం మౌలానా ఆజాద్‌నగర్ బస్తీ దవాఖానాలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యులు కృషి చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు పెరిగిపోతున్నందున మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పద్మజ, మనోజ్‌రెడ్డి, మౌనిక, మహమూద్, కీర్తి, నాయకులు వంశి, బి.భీమ్‌రాజ్, ఎస్.రవి యాదవ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యం

నల్లకుంట: పౌర హక్కులతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అంబర్‌పేట డిప్యూటీ తహసీల్దార్ బలరాం అన్నారు. గోల్నాక వెంకటేశ్వరనగర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్పొరేటర్ అమృత మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గోల్నాక ఏఈ శివశంకర్, ఫుడ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, బీజేపీ నాయకులు ప్రశాంత్‌జోషి, కిషోర్‌కుమార్, కేజే బాబు, లక్ష్మణ్‌కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అంబర్‌పేట డిప్యూటీ తహసీల్దార్ బలరాం

అప్రమత్తతే.. ఆరోగ్యం..!

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు
- వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు అవసరం

నల్లకుంట: వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ప్రజలు పలు రకాలైన సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలు, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలతో పాటు డయేరియా బారిన పడ్డ రోగులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. స్థానిక ఫీవర్ ఆస్పత్రిలో రోజుకు సుమారు మూడు 100 నుంచి 600 మంది రోగులు వివిధ వ్యాధులతో చికిత్సల నిమిత్తం వస్తున్నారు. ఇది కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో రోగులు ఇవే వ్యాధులతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

☛ ఇటీవల కురిసిన వర్షాలతో పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వాతావరణ మార్పుల వల్ల బస్తీలు, మురికి వాడల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. కలుషిత తాగునీరు, దోమలు, ఈగల ద్వారా అతిసారం, టైఫాయిడ్, చికూన్ గన్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సులువుగా వ్యాప్తి చెందుతున్నాయి. రక్త కణాలు తగ్గిపోవడంతో పలువురు మంచాన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసరాల శుభ్రత, ఆహార నియమాలు పాటించటంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఈగలతో టైఫాయిడ్ కలరా..

ఇళ్ల చుట్టూ నీరు నిలవడం, మురుగు గుంతల వల్ల ఈగలు ఎక్కువగా పుట్టుకొస్తాయి. వీటివల్ల 'సాల్మానెల్లాటైపి బ్యాక్టీరియా'మనపై వచ్చి చేరుతుంది. దీంతో టైఫాయిడ్‌గా మారుతుంది. తరుచూ జ్వరం వస్తుంటే రక్త పరీక్ష చేయించి వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి.

దోమలతో చికూన్‌గన్యా, డెంగీ...

దోమకాటు వల్ల మలేరియా, చికూన్‌గున్య వ్యాప్తి చెందుతాయి. 'ఎనాఫిలస్'దోమవల్ల మలేరియా వస్తుంది. తరుచూ జ్వరం తలనొప్పి, చలి జ్వరం వేధిస్తుంటే చికూన్ గన్యా సోకినట్టు సంకేతం. మోచేతులు, మోకాళ్లపైనా ఈ దోమలు ఎక్కువగా కుడుతుంటాయి. ఒళ్లంతా దద్దుర్లు వచ్చి, తెల్ల రక్త కణాలు తగ్గి నీరసించిపోతారు.

పారిశుద్ధ్య లోపంతో హెపటైటీస్..

సీజనల్ వ్యాధుల్లో హెపటైటిస్ ఒకటి, పారిశుద్ధ్య లోపంవల్లే ఈ వ్యాధి సోకుతుంది. కాలేయ సంబంధిత ఇబ్బందులు ఏర్పడి పచ్చ కామెర్లు వస్తాయి. కళ్లు, చర్మం పచ్చబడటం ఈ వ్యాధి లక్షణాలు. వైద్యం పొందుతూ, కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలని వైద్యులు చెపుతున్నారు.



తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దీప్తి పటేల్



ఓపీ చీటిల కోసం ఫీవర్ ఎమర్జెన్సీ ఓపీ క్యూ లైన్ వద్ద వేచి ఉన్న రోగులు

కలుసిత నీరు, ఆహార పదార్థాలతో అతిసార, డయేరియా..

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిల్వ ఆహార పదార్థాలు, తాగునీరు కలుషిత కావడం వల్ల అతిసార సంక్రమించే సూచనలు కనిపిస్తున్నాయి. చేపలు, మాంసాహారం, అపరిశుభ్ర వాతావరణంలో వీధుల్లో విక్రయించే తినుబండారాల వల్ల ఎక్కువగా ఈ వ్యాధి వస్తోంది. ఇలా వ్యాధి సోకిన వారికి విపరీతంగా వాంతులు, విరేచనాలు అతిగా ఉండటం వల్ల శరీరంలో నీటి శాతం బాగా తగ్గి బలహీనంగా తయారవుతారు.

అన్ని జ్వరాలు డెంగీ కాదు



సాధారణంగా జ్వరం రెండు, మూడు రోజులు మించి వస్తే డెంగీ జ్వరం అని జనం కంగారు పడుతున్నారు. అన్ని జ్వరాలు డెంగీ కాదు. డెంగీ జ్వరం రాకుండా తగు జాగ్రత్తలు పాటిస్తే డెంగీ నివారించుకోవచ్చు. సాధారణ జ్వరం వచ్చిన వ్యక్తి శరీరంలో ప్లేట్‌లెట్స్ పడిపోతాయి. మళ్లీ జ్వరం తగ్గిన తరువాత పౌష్టికాహారం తీసుకుంటే ప్లేట్‌లెట్స్ పెరుగుతాయి. డెంగీ వల్ల రక్త కణాలు తగ్గిపోతాయని చెప్పడం వాస్తవం కాదు. తాగునీరు కలుషితం కావడం వల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఫీవర్‌కు ఎక్కువగా జ్వరాలు, డయేరియా వంటి కేసులు వస్తున్నాయి.

– డాక్టర్ ఎ.జయలక్ష్మి, ఫీవర్ ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంఓ

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఆహార పదార్థాలను తినొద్దు. వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలి. ఇంటి అవసరాలకు, స్నానానికి కలుషిత నీరు వాడొద్దు. జ్వరం వస్తే వైద్యుల సలహాపై మందులు వాడాలి. కాచి చల్లార్చిన నీటిని సేవించడం చాలా ఉత్తమం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల చాలా రోగాల నుంచి విముక్తి పొందవచ్చు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి.

– డాక్టర్ దీప్తి పటేల్, తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి

ఐక్య ఉద్యమాలకు పిలుపునివ్వడం అభినందనీయం

కాచిగూడ: తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పార్టీలకతీతంగా ఐక్య ఉద్యమాలకు అందరూ కలిసి రావాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. ఎస్.సింహాద్రియాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 42శాతం బీసీ రిజర్వేషన్లు తెలంగాణ ప్రజల సమస్య అని, అన్ని పార్టీలు, సంఘాలు, మేధావులు కలిసి రావాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఐక్య ఉద్యమాలకు పిలుపునివ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్‌కు పంపించారని తెలిపారు. ఆ ఆర్డినెన్స్‌ను గవర్నర్ భారత రాష్ట్రపతికి పంపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీజేపీ కార్యకర్తగా వ్యవహరిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని సమాజ్ వాది పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. బీజేపీ పాలన బీసీ వ్యతిరేక పాలనగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఐక్య ఉద్యమంలో పాల్గొనడానికి సమాజ్‌వాది పార్టీ సిద్ధంగా ఉందన్నారు. బీసీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని అధికారం నుంచి దింపడానికి సమయం దగ్గర పడిందని ఆయన హెచ్చరించారు. బీసీ,ఎస్సీ,ఎస్టీలు అందరూ ఐక్యమై రాజ్యాధికార సాధన దిశగా పయనించాలని ఆయన అన్నారు.

మనిషిని పతాకస్థాయిలో నిలిపిన కావ్యం 'విశ్వంభర'

చిక్కడపల్లి: మనిషిని పతాక స్థాయిలో నిలిపిన కావ్యం విశ్వంభర అని సినారె ఆ కావ్య రచనతో తెలుగు భాష కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో సినారె సంగీత పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. త్యాగరాయ గానసభలో బుధవారం డీఏ మిత్రకు పురస్కారాన్ని జస్టిస్ రాధారాణి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డా. వోలేటి పార్వతీశం, సాహిత్య పరిషత్ కార్యదర్శి డా. చెన్నయ్య, వరప్రసాద్, వంశీ రామరాజు, డా. తెన్నేటి సుధాశైలజ, గీతాంజలి, వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

కవాడిగూడ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి (టీడీఆర్పీఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం సుమన్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీఆర్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నాయకులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సుమన్‌మాదిగ మాట్లాడుతూ..... విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోవడం సరికాదన్నారు. విద్యారంగం అభివృద్ధికి కేటాయించి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుగా భావించొద్దన్నారు. అది భవిష్యత్ తరాలపై పెట్టుబడిగా భావించాలని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీకాంత్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండి అజయ్‌మాదిగ, నాయకులు యాదగిరి, సుదర్శన్, డబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న టీడీఆర్పీఎస్ అధ్యక్షుడు గంధం సుమన్‌మాదిగ, బండి అజయ్

త్వరలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి ఏర్పాట్లు

కాచిగూడ: గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డుల పంపిణీపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరలో రేషన్‌కార్డుల ఎంక్వైరీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అపర్ణ, పౌర సరఫరాల అధికారి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి




రత్నానగర్‌లో పౌర హక్కుల సదస్సులో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై విరివిగా అవగాహన సదస్సులు నిర్వహించాలని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత మండల రెవెన్యూ అధికారులను కోరారు. హిమాయత్‌నగర్ తహసీల్ ఆధ్వర్యంలో బుధవారం రత్నానగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి హాజరైన కార్పొరేటర్, హిమాయత్‌నగర్ ఎంఆర్‌ఓ రఘు విష్ణుకుమార్‌తో కలిసి మాట్లాడారు. ప్రతి నెల 30వ తేది అన్ని మండల కేంద్రాల్లో పౌరహక్కుల దినాన్ని నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిర్ణయించిందని చెప్పారు. సివిల్ రైట్స్ డేని మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తే ప్రజల సమస్యలపై యంత్రాంగానికి స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల అమలులో సత్వర నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో ఏఎస్‌డబ్ల్యూఓ శాంతి, జీహెచ్‌ఎంసీ అధికారి ఐలయ్య, బస్తీ సంక్షేమ సంఘం నాయకులు ఎంబీ. కిశోర్‌కుమార్, పింజరి నర్సింగ్‌రావు, పాతకోటి మహేష్, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసే ఫర్టిలిటీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: మారుతున్న సామాజిక పరిస్థితులలో ప్రజలు సంతానం కావాలని ఆశతో ఫర్టిలిటీ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారని వారిని మోసం చేస్తున్న కేంద్రాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పీవైఎల్ నగర అధ్యక్షుడు బీఎస్ కృష్ణ అన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో జె.వెంకటిని బుధవారం పీవైఎల్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం బీఎస్ కృష్ణ మాట్లాడుతూ... ప్రజల ఆశలు, బలహీనతలను ఆసరా చేసుకుని నగరంలో ఫర్టిలిటీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని అన్నారు. ఇటీవల ఓ ఫర్టిలిటీ సెంటర్‌లో పిల్లలు లేని దంపతులకు సరోగసీ ద్వారా సంతానోత్పత్తి చేస్తామని చెప్పి రూ.30–50 లక్షలు వసూలు చేసి మోసం చేశారన్నారు. వీర్యకణాల సేకరణ కేంద్రాల్లో అక్రమ దందా కొనసాగుతున్నా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అక్రమ సరోగసీ, స్పెర్మ్, చిన్నారుల ట్రాఫికింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఫర్టిలిటీ సెంటర్ల అనుమతులను పరిశీలించి, వాటిలోని సౌకర్యాలు, అర్హతలను తనిఖీ చేసి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, నగర ఉపాధ్యక్షులు ఎం.రవికుమార్, కిరణ్, నాయకులు రవి, సాయి, గణేష్, నాగేశ్వరరావు, నాగయ్య, రాము పాల్గొన్నారు.



డీఎంఅండ్‌హెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

వీవర్స్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ బ్రోచర్ ఆవిష్కరణ

కాచిగూడ: చేనేతకు చేయూతనందించి నేత కళాకారులను ఆదుకోవాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూప ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 3 వరకు 'హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్'నిర్వహిస్తున్నామని అన్నారు. నారాయణగూడ పద్మశాలి భవన్‌లో జరిగే ఈ ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ ఎగ్జిబిషన్‌ను టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్, రూపాస దాశివ్, రాంచందర్‌రావు, శ్రావణ్, నోముల రేఖ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయం వద్ద షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆర్టీసీక్రాస్ రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో సుమారు రూ.10లక్షలతో షెడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావుతో కలసి ఆయన షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు పూసరాజు, వినయ్‌కుమార్, ఎంఎస్ శ్రీనివాసరావు, ముఠాజై సింహ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు శివకుమార్, జె.శివకుమార్, ఎం.రాజేష్, సాయి కీర్త్, భానుచందర్, గజానంద్, భాగ్యలక్ష్మి, గుర్రం దినేష్, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతలో బాధ్యతగా వ్యవహరించాలి

ముషీరాబాద్: వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, జోనల్ కమిషనర్ రవికిరణ్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. ప్రతి డివిజన్‌లో 2 నుంచి 3 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మట్టి కుప్పలు, చెత్తాచెదారం, గృహనిర్మాణ వ్యర్థాలు తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 8వ తేదీ వరకు కొనసాగిస్తామని డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్ల పరిశుభ్రత, తమ ఇంటి పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. అప్పుడే ప్రజలు రోగాల బారిన పడకుండా కొంత వరకు నియంత్రించగలమని తెలిపారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీఎంసీ, ఏఎంవోహెచ్

బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

కాచిగూడ: బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా ఆర్డినెన్స్‌ను తెచ్చేందుకు నిరాకరిస్తూ బీసీల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర బీజేపీ సీనియర్ నేతలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. వారం రోజుల్లోగా బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చకపోతే బీజేపీ నేతలను తెలంగాణలో తిరగనివ్వమని ఆయన హెచ్చరించారు. గ్రామాల నుంచి మండలాల వరకు పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉప్పెనలా వస్తోందని అన్నారు.

సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నల్లకుంట: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని చాలా మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారని... సైబర్ కేటుగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లకుంట క్రైం ఏఎస్సై మన్మోహన్ అన్నారు. నల్లకుంట పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని ఆయా బస్టాప్‌లలో విద్యార్థులు, ప్రయాణికులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, డయల్ 100పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రైం ఏఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికిపడితే వాళ్లకు ఓటీపీలు చెప్పొద్దన్నారు. అలాగే ఆధార్‌కార్డులు ఇవ్వొద్దని సూచించారు. సెల్ ఫోన్‌లకు వచ్చే లింక్‌లు క్లిక్ చేయకుండా జాగ్రత్త పడాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పే వారి మాటలు, ప్రకటనలు నమ్మరాదని తెలిపారు. యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంకు ఖాతాల్లో తక్కువగా డబ్బు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పీఎస్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట పోలీసు సిబ్బంది మధు, శ్రీను, వంశీ తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంట ఫీవర్ బస్టాప్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఏఎస్సై మన్మోహన్